క్లుప్తంగా

చందనం సమర్పించిన భక్తులు



శాయంపేట : మండల కేంద్రంలోని మచ్చర్ల య్యగుట్టపై వెలసిన ఆంజనేయస్వామి విగ్రహానికి హనుమాన్ మాలధారులు గురువారం చందనం సమర్పించి పూజలు నిర్వహించారు. మత్స్యగిరిస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మత్స్యగిరిస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏనుగు వాహనంపై తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకను పురస్కరించుకొని హనుమాన్ విగ్రహానికి చందనం సమర్పించినట్లు తెలిపారు. గురుస్వాములు సురేష్, బత్తుల శ్రీధర్, అక్కినపల్లి యాకయ్య, అబ్బు భాస్కర్‌రెడ్డి, ఉప్పుల రాజు, కురాకుల మొగిలి, సాయి, అఖిల్, మహేందర్, చంద్రమౌళి, అరుణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములక్నూరులోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో 2024–05 విద్యా సవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నయీంనగర్: హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ హనుమద్గిరి హనుమాన్ దీక్షా అన్నదాన సేవా సొసైటీ అధ్యక్షుడు గందె కృష్ణ, కె.రవికుమార్, రాజు, మహేందర్, నర్సింహస్వామి పాల్గొన్నారు.

స్రవంతికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో పరిశోధకురాలు కురువెల్ల స్రవంతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎవల్యూయేషన్ ఆఫ్ న్యూరోప్రొటెక్టివ్ యాక్టివిటీ ఆఫ్ సమ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్రవంతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో స్రవంతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

శ్వేతార్కలో వరుణ హోమం

కాజీపేట: ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో శ్వేతార్కుడికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, మంగళ హారతి పూజలు జరిపించారు. ఎండ తీవ్రత తగ్గాలని దేవాలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో వరుణ హోమం నిర్వహించారు.

ఆలయంలో సత్యనారాయణ వ్రతం

కాశిబుగ్గ: పౌర్ణమిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని పురాతన రంగనాథస్వామి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, చిలుపూరి సురేష్, సుల్తానా సమ్మక్క, మౌతం శ్రీనివాస్, కూరపాటి రోజా, మంచాల సృజన తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి దర్ష్ గోయల్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 25, 26వ తేదీల్లో మలేషియాలో జరగనున్న ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 14 – 15 బాలుర విభాగంలో బ్లాక్ బెల్ట్ కేటగిరి కటాస్ అండ్ స్పారింగ్ ఈవెంట్లలో పాల్గొనున్నాడు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో గోయల్‌ను కరస్పాండెంట్ వెలగందుల ముక్తీశ్వర్, ప్రిన్సిపాల్ జయప్రభ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో సైతం ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- నర్సరీల్లో 1.64 లక్షల మొక్కలు
- పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు రెడీ
- ఇంటింటికీ అందిస్తామని అధికారుల వెల్లడి



నాగయ్యపల్లి నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఆత్మకూరు : వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని 16 గ్రామపంచాయతీలకు మొక్కలను పంపిణీ చేసేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వెరైటీ పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను సంరక్షించి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రోడ్లకిరువైపుల, సంస్థాగత స్థానాల్లో పెంచేందుకు నీడనిచ్చే పెద్దసైజు మొక్కలను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. ఈమొక్కలు ప్రతి గ్రామపంచాయతీకి వెయ్యి చొప్పున 16వేల మొక్కలను రెడీ చేశారు. అలాగే మండల కేంద్రంలోని నర్సరీతో పాటు మండలంలోని అక్కంపేట, నీరుకుళ్ల, పెద్దాపూర్ నర్సరీల్లో పది వేల చొప్పున, మిగతా 12 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో 9000 చొప్పున పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. మొత్తం లక్ష 64 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జామ, బొప్పాయి, ద్రాక్ష, మునగ, దానిమ్మ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలు, గన్నేరు, చామంతి, మందార, చిన్నారె లాంటి పూల మొక్కలు, రేన్‌ట్రీ, గుల్‌మొహర్, తంగేడు, అడవిబాదం, గంగరావి లాంటి పెద్దవి నీడనిచ్చే మొక్కలను సైతం నర్సరీల్లో సంరక్షిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా పడే అవకాశం ఉన్నందున వివిధ నర్సరీల్లో పర్యవేక్షణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొక్కల సంరక్షణపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి వహిస్తున్నారు. మండల స్థాయి అధికారులు సైతం సూచనలు, సలహాలు ఇస్తూ హరితహారానికి సిద్ధం చేస్తున్నారు.



తిరుమలగిరి నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

ప్రతీ ఇంటికి అందిస్తాం..



మండలంలోని 16 గ్రామపంచాయతీల్లోని ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేస్తాం. అనువైన సమయం రాగానే పంపిణీ మొదలు పెడతాం. పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను అందించి నాటించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేందుకు కృషి చేయాలి. మొక్కల నాటే కార్యక్రమం ఉద్యమంలా జరగాలి. హరితహారంలో అందరూ భాగస్వామ్యం కావాలి.

– డి.రాజిరెడ్డి, ఈజీఎస్, ఏపీఓ.

హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శాయంపేట : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని నవోదయ హైస్కూల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. పట్టభద్రుల తరఫున తన గళం వినిపించే వ్యక్తి మల్లన్న అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రస్తావించిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణి, ప్రకాశ్‌రెడ్డి, రాజిరెడ్డి, రవి, భాస్కర్, కుమారస్వామి, మార్కండేయ, కట్టయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

రథం ప్రారంభం

మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయానికి జిన్నా కృపాకర్‌రెడ్డి–రేఖ దంపతులు బహూకరించిన రథాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రారంభించారు. మత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనగా ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు.

తీన్మార్ మల్లన్నకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

శాయంపేట : జర్నలిజం ముసుగులో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ కోట్ల రూపాయలు సంపాదించిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులంతా ఓటుతో బుద్ధి చెప్పి ఓడించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంతో మంది వ్యాపారస్తులను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేస్తూ చాలామంది కుటుంబాలను నాశనం చేసిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. అలాంటి వ్యక్తిని పెద్దల సభకు పంపించొద్దని పట్టభద్రులను కోరారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 14,800 మంది పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉన్నారని, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు అరికిల్ల ప్రసాద్, దైనంపల్లి సుమన్, విజయ్‌కుమార్, మారెపల్లి నందం, గంట శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై కొలువుదీరిన మత్స్యగిరీశుడు

- మంగళహారతులు పట్టిన మహిళలు



గజవాహనంపై బయలుదేరిన మత్స్యగిరిస్వామి

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలోని తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గజవాహనంపై మత్స్యగిరీశుడు కొలువుదీరాడు. భక్తులు పురవీధుల గుండా మంగళవాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించి మచ్చర్లయ్యగుట్టకు తరలివెళ్లారు. మహిళలు మంగళహారతుతో మత్స్యగిరిశుడికి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ వేడుకలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, వరంగల్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవి, కాంగ్రెస్ నాయకులు రవి, కృష్ణమూర్తి, రవీందర్ (బుజ్జన్న), శివశంకర్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

వేలేరు: మండలంలోని షోడాషపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పిడుగుపడి జినుకల రవికి చెందిన ఆవు మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గృహోపకరణాలు..

శాయంపేట: మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో శాయంపేట పరిసర ప్రాంతంలో భారీ శబ్దంతో పిడుగు పడింది. శాయంపేట సెంటర్ నుంచి బీసీ కాలనీ వరకు ఉన్న ఇళ్లల్లో ఫ్యాన్లు, టీవీలు, సీసీ కెమెరాలు కాలిపోయాయి. సీలింగ్ ఫ్యాన్లు భారీ మొత్తంలో కాలిపోయాయి.

హమాలీ కార్మికులకు పనిభద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న అశోక్

పరకాల : హమాలీ కార్మికులకు పనిభద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ధమ్మల రామమూర్తి, డివిజన్ అధ్యక్షుడు లంకదాసరి అశోక్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ డివిజన్‌స్థాయి సమావేశం పట్టణంలోని రైతువేదిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పనిభద్రతతో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. హమాలీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు రూ.3వేల పింఛన్, ఇళ్లు లేని కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులకు అనుకూల చట్టాలను తయారు చేయడం కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ పరకాల డివిజన్ అధ్యక్షుడు లంకదాసరి అశోక్, నాయకులు ఇల్లందుల రాములు, మహేందర్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి



ఇంద్రసేనా రెడ్డి (ఫైల్)

నడికూడ : భార్యతో గొడవపడి మద్యానికి బానిసైన వ్యక్తి మృతిచెందారు. ఈ సంఘటన మండలంలోని చర్లపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన దూదుపాల ఇంద్రసేనారెడ్డి (50) భార్యతో గొడవ పడి ఏడు సంవత్సరాల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి గ్రామంలోని మసీద్ వద్ద గల బెంచీపై పడుకున్నాడు. గురువారం ఉదయం నిద్రలేవకుండా ఉండగా గ్రామానికి చెందిన సమ్మిరెడ్డి వెళ్లి చూశాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా మృతిచెంది ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ నాయకులు

ఆత్మకూరు : ఈనెల 30వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన డీబీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని అక్కంపేటలో గురువారం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజ్యాంగ పరిరక్షణతో పాటు హక్కుల కోసం డీబీఎఫ్ పోరాడుతోందన్నారు. ఈ మహాసభలకు ప్రతిఒక్కరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, మాజీ సర్పంచ్ మాదాసి కుమారస్వామి, నాయకులు మేకల సాంబయ్య, ప్రసంగి, రమేష్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ఘనంగా పుష్పయాగం



లక్ష్మీనరసింహుడికి అభిషేకం, చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

- ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఐనవోలు : కక్కిరాలపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం మహా పూర్ణాహుతి, ఉత్సవమూర్తి లక్ష్మీనరసింహుడికి అభిషేకాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం, అవభృదోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం నాగవెల్లి, ద్వాదశారాధనలు, పుష్పయాగం, దేవతా ఉద్వాసన, ద్వాదశ ఆవరణ సేవలు విశేషంగా జరిపించారు. ధ్వజపట ఉద్వాసన, ఋత్విక్ సన్మానం చేసిన అనంతరం స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ జరిపించారు. భక్తులకు తీర్థం, 12 రకాల ప్రసాదాలు అందజేయడంతో బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పంచామృతాలు, పూలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, కమిటీ సభ్యులు తాడెం మోహన్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

వాగులోపడి మహిళ మృతి



నీటిలో తేలిన రాధ మృతదేహం

నడికూడ : బట్టలు ఉతకడానికి వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు వాగులోపడి మృతిచెందింది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గుండెకరి రాధ(55) గతంలో భర్త చనిపోయాడు. అప్పటి నుంచి శనిగరంలోని తన కూతురు ఇంటి వద్ద ఉంటుంది. బుధవారం కూతురుతో బట్టలు ఉతుకుకోవడానికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఆమె.. తిరిగి రాలేదు. గురువారం మహ్మద్‌షానల్లమాటువాగు చెక్‌డ్యాంలో శవమై తేలింది. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దామెర : మండలంలోని ల్యాదెళ్లలో వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి నిత్యపూజలు నిర్వహించిన అనంతరం అర్చనలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ స్వామివారికి కల్యాణం జరిపించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలు, ధూప దీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించారు. ఈ వేడుకలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి–సుధేష్ణదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారితోపాటు పిట్టల రమేష్, రామంచి నిరంజన్, రాజనందం, గునిగంటి రమేష్, కొలనుపాక సుధాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఆత్మకూరులో ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఆత్మకూరు : వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల సందడి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణు గోపాల స్వామి ఆలయంలో గురువారంతో బ్రహోత్సవాలు ముగిశాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆరుట్ల మాధవ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర జరిగింది.

నేడు సర్వసభ్య సమావేశం

దామెర : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్పన గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. కాగా త్వరలో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో ఇది చివరి సర్వసభ్య సమావేశం కానుంది.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు, నిందితులతో పోలీసులు

నడికూడ : మండలంలోని రామకృష్ణపూర్–కంఠాత్మకూరు గ్రామ శివారులో పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. పేకాడుతున్న ఎరుకల శ్రీనివాస్,(రామకృష్ణపూర్), బొంత రాజు, దుంపల మహేష్ (పెగడపల్లి), నరహరిశెట్టి శ్రీనివాస్, (కరీమాబాద్, వరంగల్,) వేములపల్లి అశోక్, (వరంగల్), చిలువేరు కుమార్, (వంగపహాడ్), బైరగోని పరమేష్, (అర్వపల్లి)ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా ముస్కా శేఖర్ (వంగపహాడ్) గోనె కేశవులు (రామకృష్ణపూర్) పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న ఏడుగురు వ్యక్తుల నుంచి రూ.50,360 నగదు, పేక ముక్కలు, 5 బైక్‌లు, 7సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు



శ్రీను

ధర్మసాగర్ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు సీఐ మహేందర్ తెలిపారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మునిగాల శ్రీను ఈనెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఛాయనలుపు రంగు, కోలా ముఖం కలిగి ఉంటాడని, వైట్‌షర్ట్, బ్లూకలర్ ప్యాంటు ధరించి ఉంటాడని, అచూకి తెలిసిన వారు 8712685127, 8712584511, 8712685010 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. మండల పరిధితో పాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా కనిపించినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత



వృద్ధుడిని అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

కాశిబుగ్గ: మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయిన వృద్ధుడిని వరంగల్ ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం రాత్రి అప్పగించారు. ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్టకు చెందిన పార్సి మనోహర్(85) మతిస్థిమితం సరిగాలేక ఇంటి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి అక్కడ నుంచి గుర్తు తెలియని రైలులో వరంగల్‌కు చేరుకున్నాడు. అతడి ఆచూకీని ఆర్పీఎఫ్ సిబ్బంది సేకరించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వర్షానికి తడిసిన ధాన్యం



పరకాల : పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యం కురిసిన వర్షానికి తడిసిముద్దైంది. బుధవారం మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ ధాన్యాన్ని కుప్పలుగా ఆరబెడితే ఎప్పుడు ఎంతాయని, పలుచగా ఆరబెట్టాలని రైతులకు సూచించారు. అయితే వర్షం వస్తే పలుచగా ఆరబెట్టిన ధాన్యాన్ని దగ్గరికి చేసేలోపే తలిపోతున్నాయని రైతులు కలెక్టర్ వివరించారు. అయినా కుప్పలుగా ఆరబెట్టొద్దని సూచించారు. దీంతో రైతులు ధాన్యాన్ని పలుచగా ఆరబెట్టారు. కాగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిముద్దయ్యాయి.